# జిల్లాలో 159 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

## కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో 2లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందనే అంచనాతో 159 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. శుక్రవారం ఐడీవోసీ సమావేశ మందిరంలో పౌర సరఫరాల శాఖ, సంస్థ ఆధ్వర్యంలో వానకాలం ధాన్యం కొనుగోలు ప్రక్రియపై డీఆర్‌డీవో, సహకారశాఖ, జీసీసీ, మార్కెటింగ్, వ్యవసాయ, తూనికలు, కొలతలు, రైస్‌మిల్లర్లు, రవాణా అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఇబ్బంది పడకుండా ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరాన్ని బట్టి అదనపు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఏ గ్రేడ్ ధాన్యం రూ.2203, బీ గ్రేడ్ రకం రూ.2183 మద్దతు ధర నిర్ణయించినట్లు చెప్పారు. రైతులు మద్దతు ధర పొందేందుకు ధాన్యాన్ని బాగా ఆరబెట్టి చెత్తా, తాలు, పొల్లు, పొట్టు, మట్టి లేకుండా శుభ్రపర్చి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

సమావేశంలో అదనపు కలెక్టర్ రాంబాబు, డీఆర్‌డీవో మధుసూదన్‌రాజు, పౌర సరఫరాల సంస్థ మేనేజర్ త్రినాధ్, పౌర సరఫరాల అధికారి రుక్మిణి, డీసీవో వెంకటేశ్వర్లు, వ్యవసాయ అధికారి కొర్సా అభిమన్యుడు, ఉద్యాన అధికారి జినుగు మరియన్న, మేనేజర్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

### పామాయిల్ సాగుకు చర్యలు

కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 27 : సంప్రదాయ పంటల సాగును విడనాడి రైతులు పామాయిల్ సాగు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రియాంక ఆల ఉద్యాన, వ్యవసాయ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీవోసీ కార్యాలయం సమావేశ మందిరంలో ఉద్యాన, వ్యవసాయ, గోద్రేజ్, ఆయిల్‌పెడ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబర్ వరకు 8,400 మొక్కలు నాటాల్సి ఉండగా 7,147 మొక్కలు నాటామని, మిగిలిన 1,253 మొక్కలు ఈనెలాఖరు వరకు నాటేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. రానున్న వేసవిలో పంట సాగుపై క్రాప్ బుకింగ్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో వ్యవసాయ అధికారి అభిమన్యుడు, ఉద్యాన అధికారి మరియన్న, వ్యవసాయ అధికారులు, ఆయిల్‌ఫెడ్, గోద్రేజ్ అధికారులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు ఇంటింటికీ అందించాలి

### తుదిశ్వాస వరకూ ప్రజలకు సేవ చేస్తా

### ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

లక్ష్మీదేవిపల్లి, అక్టోబర్ 27 : సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గడప గడపకూ తీసుకెళ్లాలని, అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్ గెలుపునకు కారణం అవుతాయని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని హేమచంద్రాపురంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నా తుది శ్వాస ఉన్నంత వరకు ప్రజలకు సేవచేయడమే నా లక్ష్యం అన్నారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతుబీమా పథకం పేద రైతులకు ధీమాగా మారిందన్నారు. మీ అమూల్యమైన ఓటు కారు గుర్తుపై వేసి గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎమ్మెల్యేకు మహిళలు హారతిచ్చి స్వాగతం పలికారు. ప్రచారంలో యువత, మహిళలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.


ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే వనమా

## ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా..

### ప్రచారంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావు


మాట్లాడుతున్న తెల్లం వెంకట్రావు

చర్ల, అక్టోబరు 27 : నేను మీవాడిని మన సమస్యలు అన్నీ నాకు తెలుసు.. వచ్చే ఎన్నికల్లో నన్ను ఆశీర్వదించండి అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తా అని భద్రాచలం బీఆర్‌ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మండలంలోని మామిడిగూడెం, కుదునూరు, కలివేరు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. వెంకట్రావు వైద్యుడిగా అందరికీ సుపరిచితుడు కావడంతో అడుగడుగునా ప్రజలు సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తెల్లం మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పాలకులు పట్టించుకోకపోవడంతో భద్రాచలం నియోజకవర్గంలో అభివృద్ధికి ఆమడదూరంలో ఉందని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత అబివృద్ధిని ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. నవంబరు 30న జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ప్రజలు గతంలో కాంగ్రెస్‌పార్టీకి ఓటువేసి చేసిన తప్పును సరిదిద్దుకునే అవకాశం వచ్చిందని, మా అందరివాడివైన నిన్ను గెలిపించుకుంటామని మామిడిగూడెం, కుదునూరు, కలివేరు గ్రామాల ప్రజలు తెలిపారు. డివిజన్ నాయకులు రమేశ్‌గౌడ్, ఎంపీపీ గీద కోదండరామయ్య, ప్రచార కార్యదర్శి కొటేరు శ్రీనివాసరెడ్డి, ఎస్టీసెల్ అధ్యక్షుడు కాపుల నాగరాజు, ఎంపీటీసీ కుంజా నాగేశ్వరరావు, తుర్రం రవి, సీనియర్ నాయకులు సీతాపతిరాజు, కొప్పినీడు బాబూరావు, తాతరాజు, ముప్పిడి రమేశ్, వేములవాడ క్రిష్ణార్జునరావు విజయ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వరచారి

## ఎస్‌ఈఏఎస్ సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి

### డీఈవో వెంకటేశ్వరచారి

పాల్వంచ, అక్టోబర్ 27 : వచ్చే నెల నవంబర్ మూడో తేదీన జిల్లాలోని 838 పాఠశాలల్లో మూడు, ఆరు, తొమ్మిదో తరగతి పిల్లలకు స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే(ఎస్‌ఈఏఎస్) నిర్వహించనున్నామని, ఇందుకు మండల కోఆర్డినేటర్లు, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు సమర్థవంతంగా పనిచేయాలని డీఈవో వెంకటేశ్వరచారి సూచించారు. శుక్రవారం పాల్వంచలోని బొల్లోరిగూడెం ఉన్నత పాఠశాలలో ఎంఈవోలు, మండల కో ఆర్డినేటర్లు, రిసోర్స్‌పర్సన్లతో శిక్షణ శిబిరం నిర్వహించారు. విద్యార్థుల్లో మౌలిక భాషా, గణిత సామర్థ్యాల పట్ల అవగాహనను పరీక్షించి తద్వారా బోధన వ్యూహాలను మార్పు చేసుకోవడానికి వీలుగా ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొత్తం 838 పాఠశాలల్లో దాదాపు 19వేల మంది విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తున్నామని, పరీక్ష నిర్వహణకు 924 మంది ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు మండలస్థాయిలో శిక్షణ అందించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ పరీక్షల సహాయ కార్యదర్శి మాధవరావు, కో ఆర్డినేటర్లు సైదులు, సతీశ్, మండల విద్యాధికారులు పాల్గొన్నారు.

## టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలిని కలిసిన రజాక్

రామవరం, అక్టోబర్ 27 : సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను టీబీజీకేఎస్ కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం టీబీజీకేఎస్ నాయకులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రీజినల్ సెక్రటరీ కూసన వీరభద్రం, 11మెన్ కమిటీ మెంబర్ ఏనుగు రవీందర్‌రెడ్డి, యువ నాయకుడు సిద్దంశెట్టి సాజన్,అజీజ్ పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ కవితకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎండీ రజాక్

## దుర్గాదేవికి ప్రత్యేక పూజలు

రామవరం, అక్టోబర్ 27 : అమ్మవారి దయ సింగరేణి కార్మికులకు శ్రీరామరక్ష అని డైరెక్టర్ (ఈఅండ్‌ఎం) సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం ఏరియాలోని జీఎం కార్యాలయం ఆవరణలో దుర్గాదేవిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. జీఎంలు శాలెంరాజు, రమేశ్, వెంకటరమణ, రఘురామిరెడ్డి, బసవయ్య, కవితానాయుడు, రాంకుమార్, కోటిరెడ్డి, ఏజీఎంలు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

### హెడ్డాఫీస్‌లో సహపంక్తి భోజనాలు

కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 27 : దసరా పండుగ, దేవీ శరన్నవరాత్రుల ముగింపు సందర్భంగా సింగరేణి ప్రధాన కార్యాలయంలోని దుర్గామాత గుడిలో శుక్రవారం ప్రత్యేక పూజల అనంతరం సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా జీఎం పర్సనల్ కే.బసవయ్య పాల్గొని అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం ఉద్యోగులకు దగ్గరుండి భోజనాలు వడ్డించి ఉద్యోగులతో కలిసి భోజనాలు చేశారు.


బూత్‌కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న సత్యనారాయణ

## ‘బీఆర్‌ఎస్ పథకాలతో ప్రతి ఇంటికీ లబ్ధి’

జూలూరుపాడు, అక్టోబర్ 27 : బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలతో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరిందని, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు యల్లంకి సత్యనారాయణ కోరారు. మండలంలోని కరివారిగూడెం గ్రామంలో శుక్రవారం జరిగిన బూత్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయఢంకా మోగించేలా గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు భూక్యా కళావతి, బోడా శాంతిరాం, యదళ్లపల్లి వీరభద్రం, పోలుదాసు కృష్ణమూర్తి, చావా వెంకటరామారావు, మూడు చిట్టిబాబు, దుద్దుకూరి నాగేశ్వరరావు, గుగులోతు కోట్యా, భీమారావు, భాస్కర్ పాల్గొన్నారు. వినోభానగర్ గ్రామంలో బీఆర్‌ఎస్ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చప్పిడి ప్రసాద్, సాయిన్ని హరీశ్, భూక్యా చందూలాల్, గంగావత్ నవీన్, భూక్యా శివ, మలుసూర్, దీప్లా పాల్గొన్నారు.

## పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం


పంచామృతాభిషేకం జరుపుతున్న అర్చకులు

పాల్వంచ రూరల్, అక్టోబర్ 27 : మండలంలోని కేశవాపురం–జగన్నాధపురం గ్రామాల మధ్య వెలసిన పెద్దమ్మతల్లి ఆలయంలోని శ్రీకనకదుర్గ అమ్మవారికి అర్చకులు శుక్రవారం పంచామృతాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆలయం ఎదురుగా ఉన్న అమ్మవారి జన్మస్థలం వద్ద మేళతాళాలతో ప్రత్యేక పూజలు చేసి పసుపు, కుంకుమ, గాజులు ఒడిబియ్యం సమర్పించారు. పంచహారతుల కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ మహీపతి రామలింగం, ధర్మకర్తలు పాల్గొన్నారు.

ఆలయ మూసివేత : ఈ నెల 28వ తేదీన ఆలయంలోని యాగశాలలో చండీహోమం నిర్వహించి, చంద్రగ్రహణం సందర్భంగా మధ్యాహ్నం రెండుగంటల నుంచి ఆలయాన్ని మూసివేయనున్నట్లు ఈవో కార్యాలయం శుక్రవారం ప్రకటనలో తెలిపింది. తిరిగి 29వ తేదీన ఉదయం సంప్రోక్షణ అనంతరం భక్తులకు ప్రవేశం కల్పించనున్నట్లు తెలిపారు.

## 30 నుంచి విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు

కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 27 : ఈ నెల 30వ తేదీ నుంచి నవంబర్ 5వరకు సింగరేణి సంస్థ వ్యాప్తంగా విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. సంస్థవ్యాప్తంగా ఉన్న 11 ఏరియాలు, డిపార్ట్‌మెంట్ల వద్ద అవగాహన వారోత్సవాల వద్ద బ్యానర్లు, వాల్‌పోస్టర్లను అతికించడంతోపాటు కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. ఈ ఏడాది ‘అవినీతిని తరిస్కరించండి.. దేశం పట్ల నిబద్ధత కలిగి ఉండండి’ అనే అంశంపై అవగాహన కల్పిస్తున్నారు.

## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన

పాల్వంచ రూరల్, అక్టోబర్ 27 : మండలంలోని పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఆర్‌డీవో శిరీష శుక్రవారం పరిశీలించారు. కరకవాగు, పునుకుల, ఉల్వనూరు, చంద్రాలగూడెం, రేగులగూడెం, మల్లారం, కారెగట్టు, సారెకల్లు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. అక్కడి పరిస్థితులను తహసీల్దార్ నాగరాజును అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్‌ఐలు హతియా, రవికుమార్ పాల్గొన్నారు.